క్లుప్తంగా

వనజకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వాణిజ్యశాస్త్రం పరిశోధకురాలు అంబోజి వనజకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆర్గనైజేషనల్ క్లైమైట్ ఇన్‌సర్వీస్ సెక్టార్ ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ హెల్త్‌కేర్ యూనిట్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వనజకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. కామర్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యవతి పర్యవేక్షణలో వనజ తన డాక్టరేట్ పూర్తిచేశారు.

రేపు పద్మశాలి వివాహ పరిచయ వేదిక

కాజీపేట అర్బన్: పద్మశాలి వివాహ పరిచయ వేదికను వరంగల్‌లోని కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ తెలిపారు. హంటర్‌రోడ్డులోని నేత హాస్టల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

మార్చిలో జాతీయ సదస్సు



కేయూ క్యాంపస్: మార్చి 27, 28వ తేదీల్లో రెండు రోజులపాటు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. తెలంగాణ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఫిన్‌టెక్ విప్లవం – డిజిటల్ యుగంలో ఆర్థిక సేవలను పునర్ నిర్మించడం అనే అంశంపై నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్లను కేయూ వీసీ తాటికొండ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజు, సెమినార్ డైరెక్టర్ మాదాసి కనకయ్య, అధ్యాపకులు శుక్రవారం ఆవిష్కరించారు.

బీమా సొమ్ము అందజేత




మడికొండ: 46వ డివిజన్ రాంపూర్ గ్రామానికి చెందిన పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఈర్ల లింగమూర్తి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి రూ. 40వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మడికొండ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు, రాంపూర్ సంఘం అధ్యక్షుడు చందరాజు జయపాల్, సంఘం ఉపాధ్యక్షుడు దేశిని సురేష్, నగేష్, రావుల రవీందర్, వెంకటేష్, ఎల్లయ్య, సుధాకర్, ఏసోబు, స్వామి, రవీందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



రామన్నపేట: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని ముకాంబిక సేవ సమితి సభ్యుడు దొడ్డ రమేష్ కుమార్ అన్నారు. ప్రతీ అమావాస్య రోజున నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని నగరంలోని గోపాలస్వామి గుడి బస్టాండ్ వద్ద శుక్రవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతీ అమావాస్య రోజున సేవా సమితి తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

'శ్వేతార్కుడి'కి గంధోత్సవం



కాజీపేట: అమావాస్యను పురస్కరించుకుని కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతికి అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన 108 కిలోల పసుపుతో శ్వేతార్కుడికి అభిషేకం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణశర్మ, సాయి కృష్ణ శర్మ ప్రత్యేక అభిషేకాలు, సహస్ర నామార్చనలు, దుర్వాహోమం, నాగదండం పూజలు నిర్వహించారు. ఆస్థాన వ్యాఖ్యాత శనిగరపు రాజ్‌మోహన్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, గంగుల రాజిరెడ్డి, పిల్లల కుమార స్వామి, తేలు సారంగపాణి, మేకల కేదారియాదవ్, పూజారి సాయికృష్ణశర్మ పాల్గొన్నారు.

నేడు వాగ్గేయకార ఆరాధనోత్సవం, సదస్సు

హన్మకొండ కల్చరల్: మీరా సంగీత మండలి 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాగ్గేయకార ఆరాధనోత్సవం, సదస్సు నిర్వహించనున్నట్లు మండలి అధ్యక్షుడు పింగిళి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్‌మోహన్‌రెడ్డి హాల్‌లో కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

పీవీకి 'భారతరత్న' అభినందనీయం

వరంగల్: తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషా కోవిదుడు, భారత మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న'ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని టీడీపీ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో దేశం ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. పీవీని భారతరత్న పురస్కారానికి ఎంపిక చేసిన ప్రధాని మోదీకి విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

వరంగల్ చౌరస్తాలో సంబురాలు

వరంగల్ చౌరస్తా: మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై వరంగల్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, సముద్రాల పరమేశ్వర్, మల్లాది తిరుపతి రెడ్డి, బాకం హరిశంకర్, నరేష్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, కందిమల్ల మహేష్, బైరి శ్యామ్, గడల కుమార్, ముద్రాతి వెంకటేశ్వర్లు, ఎర్రగొండ శ్రీనివాస్, సిద్దోజు శ్రీనివాస్, క్రాంతి పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

అలాగే, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోనుపునూరి వీరన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్యాల వీరమల్లయ్య, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న పురస్కారంపై హర్షం

కాజీపేట రూరల్: తెలుగుజాతి తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషా కోవిదుడు మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాజీపేటలో తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ పీవీకి భారత్నరత్న ప్రకటించడం దేశానికే కాకుండా ప్రపంచానికి కూడా గర్వకారణమని అన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) రాష్ట్ర కార్యదర్శి పీఎల్ఎన్ రావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ, న్యూఢిల్లీ పిలుపు మేరకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నగరంలోని దర్గా రోడ్డులోని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదుట నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించి, కమిషనర్ ప్రణీత్ జోషికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఎల్ఎన్ రావు మాట్లాడుతూ కనీస పింఛన్ నెలకు రూ.9వేలు అందజేయాలని, పెన్షనర్ల జీవిత భాగస్వామికి కూడా ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హయ్యర్ స్లాబ్‌కు ఆప్షన్ ఇచ్చిన వారి దరఖాస్తులను వెంటనే పరిశీలించి అధిక పింఛన్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో టీఏపీఆర్‌పీఏ గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, ఆర్‌టీసీ అధ్యక్షులు ఉప్పు సమ్మయ్య, ముత్తిలింగం, మాధవరావు, నారాయణ, ఆనందం, వైఎస్ రావు, జగన్నాథం, సిరంగి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

లక్ష్యంతో ముందుకు సాగాలి

హన్మకొండ అర్బన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి సూచించారు. కళాశాల విద్యార్థులకు తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఇక్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థుల కోసం శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆప్టిట్యూడ్, కెరీర్ కోసం ఉపయోగపడే మార్గాలు, ఉద్యోగ అన్వేషణకు విద్యార్థినులు ఎలా సిద్ధం కావాలనే పలు అంశాలపై ఓరియంటేషన్ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఎస్.కవిత, మెంటార్ మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, వాణిజ్య విభాగాధిపతి జి.రజిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావం



విద్యారణ్యపురి: పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి లక్ష్మారెడ్డి ప్రారంభించగా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మహ్మద్‌అబ్దుల్ గఫార్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మోతే తిరుపతిరెడ్డి, పూజారి నరేందర్ గైడ్, మహేందర్, ప్రసాప్‌సింగ్, సామల పట్టాభి, మోతే తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

హనుమకొండలో..

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టీఎస్ (పీఆర్టీయూటీఎస్) ఆవిర్భావ దినోత్సవన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హనుమకొండ మండల శాఖ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గఫార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, బాధ్యులు రాధాకిషన్, తిరునహరి శేషు, వరంగల్ శాఖ నుంచి పత్రిక సంపాదక వర్గ సభ్యుడు నండూరి వెంకటరామరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పట్టాభిరాం, వరంగల్ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, పానుగోటి అశోక్, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రాభివృద్ధి



ఖిలా వరంగల్: కరపత్రాలను అందజేస్తున్న ప్రదీప్‌రావు



9వ డివిజన్‌లో మార్తినేని ధర్మారావు..

ఖిలా వరంగల్: కేంద్రం నిధులతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతోందని బీజేపీ నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ 37వ డివిజన్ పడమర కోట ఎస్సీవాడ, వీరునిగడ్డ కాలనీల్లో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు గోల రాజ్‌కుమార్ అధ్యక్షతన 218 బూత్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో గొర్రె కోటి, మేకల రాజు, నలగంటి నర్సింగం, శ్రీనివాస్, ఎర్రబెల్లి కుమార్, గాదె బాబు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో – బస్తీ చలో' ఇంటింటి ప్రచారం

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల ప్రధాని మోదీ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ నాయకులు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ వినూత్న ప్రచారం నిర్వహించారు. 'గావ్ చలో – బస్తీ చలో' అనే పేరుతో శుక్రవారం చేపట్టిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పాల్గొని 9వ డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కస్తూరి నవీన్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కొత్తపల్లి నవీన్, బూత్ అధ్యక్షుడు జంపాల మనీష్, అల్లం శ్యామ్, గంజి రాజేష్, హేమంత్ పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలి



హన్మకొండ చౌరస్తా: బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచితంగా వ్యవహరించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ డిమాండ్ చేసింది. ఈమేరకు నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూకు లిఖిత పూర్వకంగా నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ దగ్గర బానిసలా బతుకుతున్న బాల్క సుమన్.. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడడం అతని కుసంస్కారానికి నిదర్శనం అని విమర్శించారు. కార్యక్రమంలో తొగరు జగన్మోహన్‌రెడ్డి, నల్లా మహాత్మ, రావుల శ్రీనివాసరెడ్డి, పోతరాజు రవి, లడే రమేష్, పోసిని రవీందర్, ఆనంద్‌మోహన్, రాంమ్మోహన్‌రావు, సాజిద్‌పాషా, విజయ్‌భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్, మాడ సృజన్, అబ్బాస్‌అలీ, అనిల్, నరేందర్, చిరంజీవి, షణ్ముక, సుకన్య, నివేదిత, సుజనా తదితరులు పాల్గొన్నారు.

సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



వరంగల్ లీగల్: సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా లీగల్ సెల్ న్యాయవాదులు తెలిపారు. ఈమేరకు సీఎంకు సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుమన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అదాలత్ జంక్షన్‌లో ఆయన దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వేముల రమేష్, కందుకూరి రజినీకాంత్, సిద్ధం యుగేందర్, అరుణ్ ప్రసాద్, కునూరు రంజిత్‌కుమార్, ఆనంద్‌మోహన్, రాజకుమార్, రాజు, రవి, రమేష్, మహాత్మ, భాస్కర్‌రెడ్డి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీస్ అందజేత



కేయూ క్యాంపస్: ఉద్యోగులు, కార్మికులకు ఆరేళ్లుగా వేతనాలు పెంచడంలో కాకతీయ యూనివర్సిటీ, ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంభిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆరోపించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భద్రత కల్పించాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ తెలంగాణ యూనివర్సిటీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట రామచందర్, ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, కోశాధికారి మొగిలి రాజేందర్, ఆఫీస్ బేరర్లు మధు, రాజు, శ్రీనివాస్, శోభ పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల పోస్టింగులు పొందిన ఇన్‌స్పెక్టర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లకు సీపీ అభినందనలు తెలిపారు. నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ న్యాయం జరుగుతుందనే భరోసాను బాధితులకు కల్పించి, ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని ఆయన సూచించారు. సీపీని కలిసిన వారిలో ఇన్‌స్పెక్టర్లు పి.మల్లయ్య, తుమ్మ గోపి, సతీష్, రమణమూర్తి, అబ్బయ్య, సంతోష్, బాబులాల్, శ్రీనివాస్ యాదవ్, చంద్రమోహన్, శ్రీధర్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వరంగల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదెళ్ల శరత్ డిమాండ్ చేశారు. దేశాయిపేట రోడ్డులోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లను గత ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరీష్, సాగర్, శివకుమార్, సంతోష్, రాజేష్, అభిరామ్, ప్రభాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

రేపు రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: ఈనెల 11న నగరంలోని భీమారంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో టీజీటీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు బండి నాగేశ్వర్, మహమ్మద్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త రెవెన్యూ చట్టం అంటూ సర్దుబాటు, సర్వీసు క్రమబద్ధీకరణ పేర్లతో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులను రెవెన్యూ శాఖకు దూరం చేయాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు తెలుస్తోందని అన్నారు. ఈక్రమంలో నష్టపోయిన పే, సర్వీసు ప్రొటెక్షన్, కోల్పోయిన పదోన్నతులు, వివిధ హోదాల్లో రెవెన్యూ శాఖలోనే కొనసాగుతూ నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై సమ్మేళనంలో చర్చించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.


టీపీటీఎఫ్ నాయకుల బైక్ ర్యాలీ

విద్యారణ్యపురి: ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) హనుమకొండ జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈమేరకు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పబ్లిక్‌గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, జిల్లా అధ్యక్షుడు రఘుపతి, నాయకులు నటరాజ్, బిల్ల సుబ్బారావు, పిల్లల జయప్రకాశ్, చంద్రగిరి లక్ష్మయ్య, గొడిశాల రమేష్, కుమారస్వామి, రాజేంద్రం, చక్రునాయక్, భీమళ్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు.




బైక్ ర్యాలీలో టీపీటీఎఫ్ బాధ్యులు

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి



హన్మకొండ: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



బల్దియా కార్యాలయం ఎదుట..

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఐటీయూ హసన్‌పర్తి మండల కార్యదర్శి పుల్ల అశోక్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్ వాల్‌పోస్టర్లను సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హసన్‌పర్తిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా రైతు, కార్మిక వర్గం, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద సుందర్, కీర్తి, సమ్మక్క, భిక్షపతి, కిషన్, మంజుల, హేమలత, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

బల్దియా ఎదుట వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక, గ్రామీణ బంద్ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట సమ్మె వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు పుల్ల రమేష్, గ్రేటర్ మున్సిపల్ సంఘ అధ్యక్షుడు పాశం రవియాదవ్, నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం.. ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక పరిపాలనకు తెరలేపిందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల రామ్మూర్తి, దాస్, రాజు, సమ్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రామ్మోహన్

కాజీపేట: సోమిడిలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్న భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కల్వచర్ల రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా రాపాక ఈశ్వరాచారి, ప్రధాన కార్యదర్శిగా తేలకుంట్ల యుగంధర్, కోశాధికారిగా మంచోజు శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడిగా సల్లూరి లక్ష్మీనారాయణ, చిలుపూరి కిషన్, చెల్లోజు వెంకట్రాజం చారి, దుప్పెల్లి ఉపేందర్, శలకపల్లి యాదగిరి, మంచోజు బ్రహ్మచారి, రఘుపతి, సతీష్‌చారి గెలుపొందారు.

సేవా కార్యక్రమాలతోనే వ్యాపారులకు గుర్తింపు

వరంగల్: వ్యాపారంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వ్యాపారులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్ అన్నారు. దేశాయిపేట రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లోని సంఘం 11వ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 129సభ్యులతో వర్తక సంఘం ఏర్పాటు చేసి ప్రతి ఏడాది విరివిరిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం సంఘంలో సభ్యులుగా ఉన్న దంపతులను సన్మానించి 10గ్రాముల బంగారం కాయిన్లను అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి శిరుప మాధవ్‌కుమార్, సురేష్‌కుమార్ జోషి, ఎం.వి జయభాస్కర్ రెడ్డి, నాగరాజు, కె.అశోక్, బస్వరాజు కుమార్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కలెక్టర్‌ను కలిసిన బొడ్రాయి ఉత్సవ కమిటీ

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో ఈనెల 11నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కలెక్టర్ ప్రావీణ్యను ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్‌ను శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలతను కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో కేడల జనార్దన్, నాయిని అశోక్, జీకే, బైరి రామేశ్వర్, కేడల మల్లేశం, షేర్ల అనిల్, రాహుల్, మల్లికార్జున్ ఉన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు